కుని పడుకున్న బొమ్మను చేతుల్లోకి తీసుకుని చూస్తూవుండేవాడు. దీక్షితులుగారి భార్య మెలకువతో వుండి కుర్రవాణ్ణి బుజ్జగించి తిరిగి పడుకోబెడుతూవుండేది.

బాలకృష్ణ ఒకరోజు సాయంకాలం తొక్కుడు మోటారుకారులో షికారుకు బయల్దేరాడు. వెంటవెళ్ళిన పనిమనిషికి దీక్షితులు సాధారణంగా ఇవ్వవలసిన హెచ్చరికలన్నీ చేసి పంపాడు.

వూళ్ళో వడీ సందడినిదాటి సంధ్యా సమయంలో పూరి వెలుగుల ప్రశాంత వాతావరణంలోకి వొచ్చిపడ్డారు, కారులో బాలకృష్ణ, రెండు కాళ్ళమీద పనిమనిషి. చెట్లమీద పక్షులు ముక్కులతో పొడుచుకుంటూ 'కిచకిచ' శబ్దం చేస్తూవుంటే బాలకృష్ణ బిరబిరా సాగిపోతున్నాడు. రోడ్డుమీద తనకు ముందు మేకపిల్ల అరుచుకుంటూ పెద్ద మేకను కలుసుకునే ప్రయత్నంలో పరుగెత్తుతూన్నది. బాలకృష్ణ ద్విగుణీకృత ఉత్సాహంతో తొక్కుడుబండిని నడిపించాడు. పనిమనిషి వెనకనుంచి పరుగెత్తుకొస్తున్నాడు. బాలకృష్ణ పిక్కల్లోలేని శక్తిని కలుగజేసుకున్నాడు. క్రమంగా ఎర్రని సూర్యకాంతి అంతరించిపోయి చీకటి ముసుగు కప్పవేయబడినది. పనిమనిషికీ బాలకృష్ణకు మధ్య ఎంతదూరం ఏర్పడిందో ఇక తెలుసుకోవడం అసాధ్యం.

మరునాడు తెల్లవారు జామున యథాప్రకారం బజారువాకిట్లో పాచిపని చేసుకునేందుకు మంగపతిరావుగారి భార్య ఒక కిర్సనాయిల్ బుడ్డి చేతపుచ్చుకుని తలుపు తీసింది. గడపదాటి అడుగు పెడుతూండగా ఆమె కాలికి ఏదో వొస్తువు గట్టిగా తగిలినంతనే ఆమె శరీరం పులకరించింది. ఆత్రుతతో నడుంవొంచి క్రింద వున్న వస్తువును వెనకి పట్టుకున్నది—తన రెండవ కొడుకు 'అమ్మ' అని పిలుచుకుంటూ మాటలు వొచ్చిన దగ్గరనుంచీ మొన్నటి వరకూ ఆడుకుంటూన్న కొయ్యబొమ్మ! వొణుకుతూన్న చేతులో నుండి దీపం జారి క్రిందపడి ఆరిపోయింది.

# బానిసలు చేసిన నేరం

(కథానిక)

బి. యస్. ఆర్. కృష్ణారావు

సుశీల ఏడుస్తున్నది. భారత నారీమణి అంతకన్న ఏంచేస్తుంది? గడుసుదయితే పీటలు, చెంబులు విసిరికొడుతుంది. నోరుగలదయితే తిడుతుంది. కోపమొచ్చేదయితే మూతి ముణగరదీసుకుని పడుకుంటుంది. వీరంతా భారత నారీమణులు. నవీన నారీమణి అయితే తలుపు తాళంవేసి సినిమాకు పోతుంది. కాని సుశీల ఈ రకంలో చేరదు. అచ్చగా పూర్వోత్రపు భారత నారీమణి. అంటే కడియాలు, గొళ్ళెపు గొలుసులు, చంపస్వరాలు, ముచ్చటముడి, మోచేతుల వరకు బిగువైన రవిక, కాశీపోసి బట్ట, ఇటువంటి పూర్వోత్రత కాదు కట్టుబొట్టు జుట్టులతో నవీన నారీమణి అయినా నోరు పూర్వోత్రపు నారీమణి కుండవలసిన నోరే. అంటే పూర్వోత్రపు భారత నారీమణుల్లోకూడా నోరుగలవాళ్ళున్నా సుశీల ఆ జాతిలోకూడా చేరదు. కాబట్టి సుశీలకు సుశీలయే సాటి. అంచేతనే ఏమీ చేయలేక ఏడుస్తున్నది వంటింటి పొగలో కూర్చుని. వంటింటి పొగ ఆమె ఏడుపుకు కారణభూతమయింది కాదు. రాజాధిరాజుల భార్యలైన రాణులమాదిరయితే వాళ్ళకు కోపమందిరాలూ తాపమందిరాలూ వుండేవి. ఏ కారణంచేతయినా కోపమొచ్చినప్పుడు వాళ్ళు ఆయామందిరాల్లో పడుకుని ఏడ్చేవాళ్ళు. అద్దె ఇల్లవటంచేత కోపమందిరాలు లేకపోగా పట్టుమని చిన్నగదియినా లేదు ఏడ్చేందుకు. అంచేత భారత నారీమణికి అనువైన ప్రదేశం వంటఇల్లే కాబట్టి అక్కడే కూర్చుని ఏడుస్తున్నది. అట్లా ఏడుస్తున్నదని వంటింట్లో చెయ్యవలసిన పని చెయ్యకుండా విడవటంలేదు. అట్లా చేస్తే గడుసరికింద వస్తుంది

అంచేత వంటచేస్తూనే ఏడుస్తున్నది. ఇంతకీ ఆ ఏడుపుకి కారణం భర్త కేకవేశాడు. భారత నారీమణికి భర్త ప్రత్యక్ష దైవమని తెలుసు. తిట్టినా కొట్టినా, తిరస్కరించినా, అవన్నీ దీవనలే అనుకుని సరిపెట్టుకుని భర్తను సంతోష పెట్టాలని తెలుసు. అయినప్పటికీ సుశీల ఏడుస్తున్నది. అది తన దోషం కాదు భగవంతుడు చేసిందానికి తను మాత్రం ఏం చేస్తుంది. ఆ విషయం తన భర్తకూ తెలుసు. అయినా అతను మగవాడు కనక తిట్టాడు. తిట్టాడు కనకనే సుశీల ఏడుస్తున్నది.

పదేళ్ళనుంచీ ఆ విషయమై భర్త తిడుతూనే వున్నాడు. చుట్టుపక్కల అమ్మలక్కలం కూడా ఎగతాళిగా ఈ విషయమై అంటిస్తూనే వున్నారు. ఇన్నాళ్ళనుంచీ ఆవిషయమై తర్జనభర్జనలు జరుగుతున్నప్పుడు ఇవాళ ఏడవటానికి గల కారణం? పదిగంటల రైల్లో మావాళ్ళింటికి పంపించేస్తానన్నాడు రంగారావు. అందుచేత ఏడుస్తూనే వంట చేస్తున్నది సుశీల. వంటయిపోయింది. సుశీల ఏడుపు ఎక్కువ అయింది.

'వంటయిందా' అంటూ కోపంతో వచ్చాడు రంగారావు.

'అయింది' అన్నది ఏడుస్తూనే.

'ఏడుస్తావెందుకూ. తప్పు ముందర పెట్టుకుని' అన్నాడు రోషంగా.

'అయితే ఈ తప్పు నాదంటారా' అంది కొంచెం కోపంగా.

'తప్పకుండా నీదే. ఇప్పటికి పదేళ్ళనుంచి ఓపిక పట్టివున్నాను.'

'భగవంతుడు చేసిందానికి నన్నేం చెయ్యమంటారు.'

'భగవంతుడు! వాళ్ళంతా ఏంచేశారని భగవంతుడు కనికరించాడు. నువ్వేం చెయ్యలేదని భగవంతుడిట్లాచేశాడు. నాకదంతా తెలీదు. తొందరగా అన్నం వడ్డించు బండికి టయిమయింది' అని చొక్కా విప్పివచ్చాడు అన్నానికి. సుశీల వడ్డించింది. రంగారావు భోజనమయిపోయింది. సుశీల అన్నందగ్గర కూర్చున్నదేగాని సహించలేదు.

ఇద్దరూ బస్సు స్టాండుకు వచ్చారు. అప్పుడే బస్సు వెళ్ళిపోయింది. మరో గంటకుగాని బస్సు రాదు. రంగారావు ఎదురుగావున్న హోటల్లో కూర్చున్నాడు. సుశీల ప్యాసింజర్సు షెడ్డులో కూర్చున్నది. అప్పటికి అక్కడ తానొక్కర్తే. పావుగంట గడిచింది. ఎవరో ఒకావిడ కుడిచేత్తో పెట్టెపట్టుకుని, ఎడంచేతులో పిల్లనెత్తుకుని ఎడపిల్ల చెంగులాగుతూ వెనకాల రాగా, పెద్ద పిల్లలు ముగ్గురూ చేతి సంచులూ, బుట్టలూ పట్టుకురాగా ప్యాసింజర్సు షెడ్డులోకి వచ్చింది. ఆవిడ్ని చూసి, ఎంత అదృష్టవంతురాలు అంత చక్కగా కడిగిన ముత్యాల్లాగా వున్నారు-అనుకుంది సుశీల. ఆవిడ కూడా పెట్టె వేసి దానిమీద కూర్చుంది, పసిపిల్లాడికి పాలిస్తూ. ఆవిడకళ్ళుకూడా బాగాఎర్రబడ్డయ్యి. ముఖం కందగడ్డలా అయింది. పలకరిస్తే దుఃఖం వచ్చేటట్టుగావుంది ముఖం. చక్కగా పిల్లలు కలిగిన ఈవిడ కూడా విచారపడుతున్నదేమా అనుకుంది సుశీల. ఆవిడ విచారకారణం తెల్సుకోవాలనే కుతూహలం కలిగింది.

'ఏమండీ.'

'......'

'మిమ్మల్నే'

'నన్నా.'

'అవును.'

'ఎందుకూ.'

'ఎంచక్కగా ఆణిముత్యాల్లా ముద్దొస్తున్నారు మీ పిల్లలు. అయిదుగురు పిల్లల తల్లి మీరు. ఎంత అదృష్టవంతులు మీరు.'

'చేనా. ఎగతాళి చేస్తున్నారా నన్ను.

'ఎగతాళేమిటండీ. నిజంగానే అంటున్నాను. చాలా అదృష్టవంతురాలు మీరు. మీ భర్త ఎంత సంతోషిస్తున్నారో ఈ సంతానాన్ని చూసుకుని.'

'అవును చాలా సంతోషిస్తున్నాను. మీకు పిల్లలెంతమంది.'

'నాకా. హు. ఆ యోగ్యతుంటే ఇట్లా ఎందుకుంటాను చెప్పండి. పిల్లలు లేరు.

'అబ్బ ఎంత అదృష్టవంతులు. మీరుచక్కగా ఏ గొడవా లేకుండా హాయిగా వున్నారు. మీ భర్త ఎంత సంతోషిస్తున్నారో, మీ దంపతులెంత అదృష్టవంతులు.'

'మీకూడా ఎగతాళయాను నేను. ఎంత అదృష్ట హీనురాల్ని'

'అదేమిటండీ అట్లా అంటారు. ఎగతాళి కాదు నిజంగానే అంటున్నా. ఎందుకంటే పాడు పిల్లలు, గీపురు గావురుమంటూ ఎక్కడకి పోదామన్నా వీలుండదు. మీలాంటి వాళ్లయితే నిమిషంలోకి ఇట్టే పోవచ్చు భార్యా భర్త లిద్దరూ సరదాగా'

'అందుకనే వెళుతున్నాను. అయితే మీ రెక్కడికి'

'ఈ పిల్లలంటే అసహ్యం పుట్టి కోపమొచ్చి నన్ను పుట్టింటికి పంపేస్తున్నారు. భగవంతుడు ప్రసాదించిన దానికి మనమేం చేస్తాం చెప్పండి. ఈ సంతానం కావాలని ఎవరు కోరుకున్నారు. నా వయస్సుకు అయిదుగురు పిల్లలు. పట్టుమని పాతికేళ్ళు లేవు. ఈ పిల్లలంటే రోతపుట్టి పుట్టింటికి పంపేస్తున్నారు' అంది కళ్ళ నీళ్ళు పెట్టుకుని.

'పాపం పిల్లలుగల మిమ్మల్ని మీ భర్త వదిలేస్తున్నారా. రత్నాల్లా ఉన్నారే అయిదుగురు. వాళ్ళ ముద్దుముచ్చటలూ, ఆటపాటలూ చూస్తూ వుండే అదృష్టం భగవంతుడు కలిగించాడని సంతోషంతో వుండక పిల్ల లక్కర్లేదంటున్నారా మీ వారు, మావారయితే ఎంత సంతోషించేవారు'

'ఐతే మీ రెక్కడికి వెళుతున్నారు. లింగూ లిటుక్కుమంటూ చక్కగా ఏ వూరయినా పోతున్నారా'

కాదండీ నేనూ కాపరానికొచ్చి పదేళ్ళయింది. ఇంతవరకూ భగవంతుడు ఒక్క నలుసుకూ ప్రసాదించలేదు. అంచేత మావారికి కోపమొచ్చి నన్ను పుట్టింటికి పంపేస్తున్నారు.'

ఎంతమాట, పిల్లలున్నారని నన్ను పంపేస్తుంటే పిల్లలు లేరని మిమ్మల్ని పంపేస్తున్నారన్నమాట. ఏం మనుష్యులండీ ఈ మగవాళ్లు.'

మరో అరగంట గడిచింది. బస్సు వస్తున్నది. మొగవాళ్ళిద్దరూ వచ్చారు కాఫీహోటల్లోంచి ప్యాసెంజర్సు షెడ్డులోకి.

'తొందరపడొద్దులే. ఇంకా టయిముంటుంది. అయినా పిల్లాజల్లా వున్నారు గనక నాకారు ఎక్కలేకపోవడానికి. మొదట్లే నువ్వెక్కదానివేగా' అన్నాడు రంగారావు సుశీలకు కేకలేస్తూ పక్కనున్న పిల్లల తల్లిని చూస్తూ.

'త్వరగా లే ఎంతటయిమున్నా ఈ మంద నంతా ఎక్కించి, ఈ పాలడబ్బాల సంచీ అమృతం సీసా, కార్లో పెట్టేసరికి ఆ కాస్త టయిమూ అయిపోతుంది. లెండర్రా గొర్రెల మందలా ఆ కారుదగ్గరకు సర్కసుకంపెనీకి వుల్లే వరసగా' అని చీదరించుకుంటూ సుశీలవైపు చూస్తూ అన్నాడు ఆ పిల్లలగల తండ్రి.

ఎంత బావున్నారా పిల్లలు' అనుకున్నాడు రంగారావు మనస్సులో.

'మాయ సంత, ఆ భార్యా భర్తలిద్దరూ ఏ పిల్లలూ లేకుండా చిలకా గోరంకల్లా వున్నారు అదృష్టవంతులు' అనుకున్నాడు మనస్సులో పిల్లలు గలతండ్రి.

సుశీలా, పిల్లల తల్లీ, పిల్లలూ బస్సులో ఎక్కారు. మగవాళ్ళిద్దరూ ఎక్కలేదు.

'మీ పిల్లలు చాలా బావున్నారు ముద్దొస్తూ ఎంత అదృష్టవంతులండీ మీ భార్యా భర్తలు. వాళ్ళ ముద్దు ముచ్చటలు చూస్తూ వుండొచ్చు' అన్నాడు రంగారావు ఆయనతో.

'మీరే చాలా అదృష్టవంతులు. పిల్లాజెల్లా లేకుండా వాళ్ళ పోరూ పోకూ లేకుండా చక్కగా ఏ అడ్డూ లేకుండా వున్నారు హాయిగా అన్నాడాయన.

'పిల్లలు లేక నేనెంత కలవరపడుతున్నానో మీకేం తెలుసు' అన్నాడు రంగారావు.

'పిల్లలతో ఎంత యమయాతన అనుభవిస్తున్నానో మీకేం తెల్సు. వీళ్ళ రోగాలూ, మందులూ మాకులతో విసిగి వేసారి పోయామంటే నమ్మండి. అందుకే పుట్టింటికి పంపుతున్నాను.'

'పిల్లలు లేరనే కోపంతో నేను పుట్టింటికి పంపుతున్నాను' అన్నాడు రంగారావు.

'ఎటువంటి భిన్నాభిప్రాయాలూ! ఉన్నారని ఒకళ్లు ఏడుస్తుంటే లేరని మరొకళ్లు విచారిస్తున్నారు' అన్నాడాయన.

ఇద్దరూ మాట్లాడుతూ వుండగానే బస్సు దుమ్ము రేపుకుంటూ వెళ్లిపోయింది.